క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో కొత్త ఎస్పీ మహేశ్వరరెడ్డి



ఎస్పీ మహేశ్వరరెడ్డికి ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న ఈవో చంద్రశేఖర్, శంకరశర్మలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన కె.వి. మహేశ్వరరెడ్డి తొలిసారిగా సోమవారం ఉదయం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు సంప్రదాయక స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేయించి, అనివెట్టి మండపంలో వేదాశీర్వచనాన్ని అందజేశారు. ఆలయ విశిష్టతను శంకరశర్మ కొత్త ఎస్పీకి వివరించారు. అనంతరం ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆలయ పరిసరాలన్నీ పరిశీలించారు. ఆలయం వద్ద పోలీసు భద్రత, ఇతరత్రా చర్యలపై ఈవోను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మేరకు భద్రతా చర్యలను పెంచేలా చర్యలు చేపడతామన్నారు.

చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు



చిన్నారులకు స్క్రీనింగ్ చేస్తున్న వైద్య సిబ్బంది

ఎచ్చెర్ల: మండలంలోని పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొంగరాం గ్రామంలో చిన్నారులకు సోమవారం ఆరోగ్య పరీక్షలు చేపట్టారు. పుట్టుకతో వచ్చే సమస్యలు, పెరుగుదలలో లోపాలు, వైకల్యాలు, ఇతర వ్యాధులను గుర్తించి ప్రత్యేక చికిత్సల కోసం ఎంపిక చేసేందుకు అంగన్‌వాడీ కేంద్రం వద్ద 5 ఏళ్ల లోపు చిన్నారులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించినట్లు హెల్త్ అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు తెలియజేశారు. ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, ఏఎన్‌ఎం రమణమ్మ, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.లక్ష ఆర్థికసాయం



సూరమ్మకు చెక్‌ను అందజేస్తున్న డాక్టర్ రెడ్డీస్ యాజమాన్యం ప్రతినిధులు

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం పంచాయతీలో గల సరగడపేట గ్రామానికి చెందిన యాగాటి సూర్యనారాయణ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ రెడ్డీస్ యాజమాన్యం సామాజిక కార్పొరేట్ బాధ్యతగా లక్ష రూపాయల చెక్కును సూర్యనారాయణ భార్య సూరమ్మకు సోమవారం అందజేశారు. డాక్టర్ రెడ్డీస్ పైడిభీమవరం యూనిట్ హెడ్ కె.వి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ పరిసర ప్రాంతవాసులకు అండగా నిలుస్తున్నామన్నారు. రెడ్డీస్ హెచ్‌ఆర్‌లు దీపక్, జోగారావు, పైడిభీమవరం టీడీపీ నాయకుడు రౌతు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలు చేయాలి



మాట్లాడుతున్న మొయ్యి జనార్దనరావు

జి.సిగడాం: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి ఏపీసీపీఎస్‌ఈఏ శాఖ జిల్లా కౌన్సిలర్ మొయ్యి జనార్దనరావు, గౌరవ అధ్యక్షుడు మక్క సురేష్ కోరారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యవర్గం సమావేశంలో మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. 2004 నుంచి పని చేస్తున్న ఉద్యోగులందరూ పెన్షన్ విధానం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చి హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా అధ్యక్షుడు మొయ్యి శ్రీరామ్, కోరిగాన శంకరరావు, తూముల సూర్యారావు, బెల్లాన చంద్రమౌళి, వల్లూరి రమణ, సభ్యులు పాల్గొన్నారు.

నేడు, రేపు నీటి సరఫరా బంద్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరపాలక సంస్థ పరిధిలో బలగ వాటర్‌వర్క్స్ 1200 కేఎల్ రిజర్వాయర్‌కు మరమ్మతులు చేపడుతున్నారు. ఈ కారణంగా ఈ నెల 16, 17 తేదీల్లో కుళాయిల ద్వారా నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ చల్ల ఓబులేసు సోమవారం తెలిపారు. బలగ ప్రధాన మంచి నీటి కేంద్రం ద్వారా మంచినీరు సరఫరా జరుగుతున్న ప్రాంతాలైన శాంతినగర్, నానుబాలవీధి, కానుకుర్తివీధి, పాండురంగవీధి, కృష్ణాపార్కు, నెహ్రూరోడ్డు, పుణ్యపువీధి, బుక్కావారిబంద, ఇల్లిసిపురం, బలిజేపల్లివారివీధి, చిన్నబజారు, హడ్కోకాలనీ, బలగ, రిమ్స్ ఆస్పత్రి ఏరియా, రాయ్‌లేబౌట్, మహిళామండలి వీధి, తురాయిచెట్టువీధి, వైష్ణవువీధి, కెల్లవీధి, దుర్గాదేవిగుడి ఏరియా, గుడివీధి ప్రాంతాలకు నీటి సరఫరా జరగదని తెలిపారు.

నిరుద్యోగ భృతిపై గంపెడాశలు



అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంటికి ఒక ఉద్యోగం కల్పిస్తామని, లేదంటే నిరుద్యోగ భృతిగా నెలకు మూడు వేల రూపాయలు అందజేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ హామీ ఎప్పుడు అమలు చేస్తారోనని నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుని స్పష్టమైన ప్రకటన చేయాలని కోరుతున్నారు. ఎప్పటి నుంచి నిరుద్యోగ భృతి ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మాదిరిగా లక్షల సంఖ్యలో ఉద్యోగాలు ఇవ్వాలని వేడుకుంటున్నారు. ఎచ్చెర్ల నియోజక వర్గంలోని ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల్లో 87 వేల మంది వరకు నిరుద్యోగులు ఉన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, ఐటీఐ వంటి విద్యార్హతలు ఉన్న వారు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. నిరుద్యోగుల అభిప్రాయాలు వారి మాటల్లోనే.. –సాక్షి నెట్ వర్క్

మాట నిలబెట్టుకోవాలి



2014 ముందు ఎన్నికల ప్రచారంలో కూడా చంద్రబాబు ఇలానే రూ.2వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి అధికారంలోనికి వచ్చిన తరువాత మాట తప్పారు. ప్రస్తుతం 2024 ఎన్నికల్లో రూ.3వేల నిరుద్యోగ భృతిని అధికారంలోని వచ్చిన వెంటనే ఇస్తానని మ్యానిఫెస్టోలో పెట్టారు. అధికారంలోకి వచ్చి నెల రోజులైనా దీనిపై ఊసే లేకపోవడం చూస్తే నిరుద్యోగులకు వెన్నుపోటు పొడిచేలా కన్పిస్తుంది.

– ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

నిరుద్యోగులను ఆదుకోవాలి



అధికారంలోని వచ్చిన వెంటనే నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల్లో చంద్రబాబు ప్రకటించారు. తక్షణమే ఆ మాటను నిలబెట్టుకుని నిరుద్యోగులను ఆదుకోవాలి. పోటీ పరీక్షలకు సిద్ధం కావాలంటే నిరుద్యోగ భృతి ఎంతో అసరాగా ఉంటుంది.

– దన్నాన పరిసినాయుడు, దేరసాం గ్రామం, రణస్థలం మండలం

ఉద్యోగ అవకాశం కల్పించాలి



ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన మ్యానిఫెస్టోను అమలు చేయాలి. ప్రతి ఏటా ఉద్యోగాలు తీయాలి. ఉద్యోగ అవకాశం కల్పించే వరకు భృతిని అందజేయాలి.

– దన్నాన విజయభాస్కర్, దేరసాం గ్రామం, రణస్థలం మండలం

హామీ వెంటనే అమలు చేయాలి



కూటమి ప్రభుత్వం మ్యానిపెస్టోలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి తక్షణమే అమలు చేయాలి. రూ.3 వేల కోసం ఎదురుచూస్తున్నాం. ప్రస్తుతం ఉద్యోగ ప్రకటనల కోసం ఎదురుచూస్తూ చదువుతున్నాను. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు రూ.3వేలు ఎంతో ఉపయోగపడతాయి.

– యతిరాజుల శ్రీనివాసరావు, ఎం.ఎ, కేశవరావుపేట, ఎచ్చెర్ల మండలం

ప్రభుత్వం స్పందించాలి



ప్రభుత్వం ఏర్పడి నెల పూర్తయింది. అయినా నిరుద్యోగ భృతి అమలు చేయలేదు. నిరుద్యోగ భృతి కోసం నిరుద్యోగులు ఎదురు చేస్తున్నారు. ఉద్యోగం వచ్చే వరకు రూ.3 వేల భృతి అమలు చేస్తామన్న హామీపై ప్రభుత్వం స్పందించి నిర్ణయం తీసుకోవాలి.

– మొదలవలస హరినారాయణ, ఎమ్మెస్సీ, కేశవరావుపేట, ఎచ్చెర్ల మండలం

భృతి కోసం ఎదురు చూస్తున్నా



కూటమి నాయకులు ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు భృతిగా నెలకు మూడు వేల రూపాయలను ఇవ్వాలి. కూటమి ప్రభుత్వ ఏర్పాటై నెల రోజులైన ప్పటికీ ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతిపై ఎలాంటి విధివిధానలు ప్రకటించలేదు. డిగ్రీ పూర్తి చేసిన నేను నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నాను.

–డి బాలజీ, బైరివానిపేట, శ్రీకాకుళం

గరిమెళ్లను ఆదర్శంగా తీసుకోవాలి

● ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు



పాల్గొన్న విద్యార్థినులు, సాహితీ వేత్తలు

శ్రీకాకుళం కల్చరల్: స్వాతంత్ర్య సమరయోధుడు గరిమెళ్ల సత్యన్నారాయణను యువత ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. గరిమెళ్ల జయంతి కార్యక్రమాన్ని కళాశాలలో సోమవారం నిర్వహించారు. గరిమెళ్ల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిష్కలంక దేశభక్తుడు, కవి, గాయకుడైన గరిమెళ్ల జీవితం నేటి యువతకు ఆదర్శవంతమైనదని అన్నారు. ప్రజారోగ్య పరిరక్షణ వేదిక అధ్యక్షులు, జెమ్స్ కళాశాల ఆసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.మల్లేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రైవేటీకరణ విధానాలతో వైద్యరంగం అస్తవ్యస్తంగా ఉందన్నారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె. మూర్తి మాట్లాడుతూ.. గరిమెళ్ల జీవిత విశేషాలను వివరించారు. గరిమెళ్ల జయంతి సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎం.ప్రభాకారరావు, పి.సుధాకరరావు, కేతవరపు శ్రీనివాసరావు, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

‘వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలి’



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులు స్వయం శక్తిపై ఎదగాలని, నూతన పారిశ్రామికవేత్తలుగా రూపుదిద్దుకోవాలని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ(అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. కళాశాల ఐక్యూఏసీ విభాగాధిపతి ఎస్.పద్మావతి, కామర్స్ విభాగాధిపతి ఎల్.కృష్ణారావుల సంయుక్త ఆధ్వర్యంలో ‘ఇంటర్నేషనల్ స్కిల్ డే’ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ జే.ఉమామహేశ్వర్ మాట్లాడుతూ నిరుద్యోగాన్ని నిర్మూలించాలంటే స్వయంగా పారిశ్రామికవేత్తలుగా ఎదగడమే సరైన మార్గమన్నారు. అందుకు విద్యార్థి దశ నుంచే బాటలు వేసుకోవాలని సూచించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్ మాట్లాడుతు ప్రభుత్వం ద్వారా బ్యాంకులు ఎన్నో రాయితీలను, లోన్ పథకాలను కల్పిస్తుందన్నారు. వివిధ పథకాలను విద్యార్థులకు తెలియజేశారు. ఇండస్ట్రీ ప్రమోటర్ అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగడంతోపాటు మరికొంతమంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, ఎల్.కృష్ణారావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనడం వల్ల ఎన్నో నూతన అంశాలు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ రమేష్ కృష్ణ, అసిస్టెంట్ డైరక్టర్ ఇండస్ట్రీస్ సెంటర్ పీవీ రఘునాథ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర్‌నారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగించాలి



తెప్పరేవులో నిర్మాణాలు

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ పంచాయతీ తెప్పరేవు గ్రామంలో సర్వే నంబర్ 107లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు నేతింటి నీలం, నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. శ్రీకాకుళం పట్టణం జిల్లా పరిషత్‌లో, ఎచ్చెర్ల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ సెల్ మీ కోసంలో ఫిర్యాదులు వేర్వేరుగా అందించారు. చెరువు గర్భం నుంచి ఆక్రమణ తొలగించాలని, చెరువుకు హద్దులు నిర్ణయించాలని కోరారు. నాయకులు అల్లు రాజారావు, పప్పల వెంకటరావు, కె.కన్నప్పడు, పొన్నాడ శేఖర్‌బాబు ఉన్నారు.

మొక్కల పెంపకానికి ప్రాధాన్యం



ఉద్యానవన పంటలను పరిశీలిస్తున్న ఏపీడీ లోకేష్

ఎచ్చెర్ల: ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉద్యానవన మొక్కల పెంపకానికి ప్రాధాన్యతం ఇవ్వాలని క్లస్టర్ ఏపీడీ లోకేష్ తెలిపారు. మండలంలోని సహాపురం, చిన్నయ్యపేట, మురపాక, కేశవరాయునిపాలెం, పెద్దరావుపల్లి తదితర గ్రామాల్లో ఉద్యాన పంటలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణం మొక్కల పెంపకానికి అనుకూలమైనదని అన్నారు. చిన్న, సన్నకారు రైతులకు కొబ్బరి, జీడిమామిడి, మునగ, పామాయిల్, సపోటా, జామి తదితర అవసరమైన మొక్కలను ఉచితంగా అందజేయడంతో పాటు మొక్క నాటిన నుంచి మూడేళ్ల కాలంపాటు నెలవారీ నిర్వహణ ఖర్చులను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూగర్భ జలాలను పెంచేందుకు ఫారంపాండ్లను నిర్మిస్తున్నామన్నారు. ప్రతీ రైతు తమ పంట పొలంలో ఫారంపాండ్‌ను ఏర్పాటు చేసుకోవాన్నారు. దీనివల్ల భవిష్యత్తులో నీటికొరత లేకుండా సాగునీరు సమకూర్చుకునే వీలుంటుందన్నారు. ఏపీఓ సత్యవతి, జేఈ లెనిన్ బాబు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం



వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: కిశోరి బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత అవసరమని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు కృష్ణాపార్కు సెక్టార్ పర్యవేక్షకురాలు పి.సీతామహాలక్ష్మి అన్నారు. శ్రీకాకుళం పట్టణంలోని చేపలవీధి ఎంపీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో మిషన్ శక్తి వంద రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.లక్ష్మి మాట్లాడుతూ.. కిశోరి బాలికలకు పలు సూచనలు అందించారు. బాల్యవివాహాలను ప్రోత్సహించ కూడదని, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో వార్డ్ ఇన్‌చార్జిలు రాజేష్‌రెడ్డి, విశ్వేశ్వరరావు, ఎంఎస్‌కేలు రత్నకుమారి, హిమబిందు, త్రివేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు సంధ్యారాణి, ఉమారాణి, కళావతి, పుష్పాలత, సుభాషిణి, భవాని, ధనలక్ష్మి, ఆశవర్కర్లు ఉన్నారు.

ఘనంగా సంతోషిమాత జయంతి



చండీహోమం

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయంలో మూడురోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి స్వాతి నక్షత్రం సందర్భంగా 108 లీటర్ల పాలతో అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరణ చేశారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో చండీపారాయణలు, 13 పట్టు చీరలతో విశేష ద్రవ్యములతో చండీ హోమం చేసి పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

తీరిన రేషన్ కష్టాలు




జీరుపాలెంలో ఆఫ్‌లైన్‌లో రేషన్ అందజేస్తున్న దృశ్యం

రణస్థలం: మండలంలోని జీరుపాలెం మత్స్యకార గ్రామంలోని 995 రేషన్ కార్డుదారులకు సోమవారం రేషన్ అందజేయడం ప్రారంభించారు. గత రెండు వారాలుగా వేలిముద్ర వేసే యంత్రం పనిచేయక రేషన్ అందలేదు. దీనిపై నలుగురు డీలర్ల పరిధిలో రేషన్ అందక గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేయడంతో సాక్షిలో ఈ నెల 13న జీరుపాలెం వాసులకు రేషన్ కష్టాలు అనే కథనం ప్రచురితమైంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి మండల స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆఫ్‌లైన్‌లో తూకం వేసి రేషన్ సరుకులను అందించడం జరుగుతుందని సివిల్ డీటీ హేమసుందర్ తెలిపారు. సెల్ టవర్ సిగ్నిల్ సక్రమంగా లేక, వేలిముద్ర వేసే మిషన్ పని చేయలేదన్నారు. సగానికి పైగా ఇప్పటికే లబ్ధిదారులకు రేషన్ సరుకులు ఇవ్వడం జరిగిందని, ఈ నెల 17వ తేదీ లోగా పూర్తి స్థాయిలో అందరికీ అందజేస్తామన్నారు.

పూజలందుకున్న జగన్నాథుడు



గుజరాతీపేటలో శ్రీరామలింగ ప్రతిష్ట అవతారం



మొండేటివీధిలో పరుశురామవాతారంలో జగన్నాథుడు



పాండ్రంగివీధిలో కూర్మావతారంలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: జగన్నాథ రథోత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. భక్తులు ఆలయాలకు వెళ్లి స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఇందులో భాగంగా జగన్నాథుడు సోమవారం వివిధ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గుజరాతీపేటలోని జగన్నాథస్వామిని శ్రీరామలింగ ప్రతిష్ట అవతారంలో అలంకరించారు. సుభద్ర, బలభద్రులతో పాటుగా జగన్నాథస్వామిని అలంకరించగా భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. పట్టణంలోని పాండ్రంగివీధిలో ఉన్న శ్రీరామమందిరం స్వామి వారిని కూర్మావతారంలో అలంకరించారు. ఆలయ అర్చకులు వేదుల ప్రదీప్, ధర్మకర్త నర్సింహమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మొండేటివీధిలోని లలితా సమేత శివకామేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో జగన్నాథస్వామిని పరశురామవతారంలో అలంకరించారు. షిర్డీ సాయి సేవా సంఘం ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

దుర్గాభాయ్ దేశ్‌ముఖ్‌కు ఘన నివాళులు



దేశముఖ్‌కు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: స్వాతంత్ర్య సమరయోధురాలు దుర్గాభాయ్ దేశముఖ్ జయంతి కార్యక్రమాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సోమవారం నిర్వహించారు. దుర్గాభాయ్ చిత్రపటానికి వీసీ కె.ఆర్.రజిని, అధికారులు నివాళులర్పించారు. మహిళా అభ్యుదయం, పేదల సంక్షేమం, జాతీయ సమైక్యత కోసం దుర్గాభాయ్ చేసిన కృషిని కొనియాడారు. రిజిస్ట్రార్ పి.సుజాత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు



కుంకుమ పూజల్లో మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న వారాహి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. మహిళలచే సామూహిక కుంకుమ, యంత్ర పూజలను అర్చకులు నిర్వహించారు. మంగళవారం మహాపూర్ణాహుతితో ఉత్సవాలు ముగిస్తాయి.

పోలీసు విభాగాల పరిశీలన

శ్రీకాకుళం క్రైమ్ : ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సోమవారం సాయంత్రం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో వివిధ పోలీసు విభాగాలను, సెక్షన్లను పరిశీలించారు. సిబ్బంది వివరాలు, పనితీరుపై ఆరా తీసి పోలీస్ కంట్రోల్ రూమ్, డీసీఆర్బీ, సైబర్‌సెల్, ఐటీకోర్, పోలీసు కార్యాలయం ఏబీసీ సెక్షన్ గదులను పరిశీలించారు. కార్యాలయం ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎస్పీ వెంట సీసీ శివకుమార్, పీఆర్వో భాస్కర్‌లు ఉన్నారు.

‘జైలులో ఖైదీల కేసులు పరిష్కరించాలి’

శ్రీకాకుళం పాతబస్టాండ్: జైలులో ఖైదీల కేసులు త్వరగా పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. సోమవారం కోర్టులో జైలు అధికారులు, పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైలు ముద్దాయిలకు చార్జిషీట్లు వేసి వారికి త్వరితగతిన న్యాయం చేసేలా పోలీసు యంత్రాంగం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ ప్రమాదం చేసి తప్పించుకునే వారి మీద సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్ బి.సుదర్శన దొర తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం పంపిణీ

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం నగరంలోని అప్‌హోల్డ్ స్వచ్ఛంద సేవాసంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎయిడ్స్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు సేవాసంస్థ ప్రతినిధులు పోషకాహారాన్ని అందజేశారు. సంస్థ చైర్మన్ అంజూరీ ఫిలిప్ తిమోతి మాట్లాడుతూ.. ఎయిడ్స్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు పోషకాహారం అందివ్వడం, విద్య కోసం ఆర్థికంగా సహాయం చేయడం, ఆరోగ్యపరమైన అవసరాలు తీర్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అప్‌హోల్డ్ స్వచ్ఛంద సంస్థ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.